# స్వతంత్రం పాట్లు

చిక్కు ఎక్కడొచ్చిందంటే, వాడు 1930 జనవరి 26న పుట్టాడు. వాడి తండ్రి వాడికి తడుపుకోకుండా స్వతంత్రం అని పేరు పెట్టాడు.

స్వతంత్రుడి తండ్రి రాజకీయరంగ స్వతంత్రం తండ్రికే తెలియదు. అతను గర్భదరిద్రుల గర్భాన పుట్టి, మూడెకరాల ఆస్తిగల విధవరాలికి దత్తుపోయాడు. వృత్తిచేత ప్లీడరు గుమాస్తా. ఇతగాడి అదృష్టం బాగుండి ఆ ప్లీడరు గారికి దశ ఎత్తుకున్నది. ప్లీడరుగారు రెండంతస్తుల మేడ కడితే, ఆ మేడను కొనెయ్యగల మొత్తం ప్లీడరు గుమాస్తా తన చెమట వోడ్చి సంపాదించి, దాన్ని తెలివిగా వడ్డీలకిచ్చాడు. ఆ కారణంగా స్వతంత్రం పుట్టిన వెంట్రుకలు తీయించుకునే లోపల అతని తండ్రి బాకీదార్ల నుంచి బాకీల రద్దుకింద పదిహేను ఎకరాల మాగాణీ భూమి, ఒక తోటా సంపాదించాడు.

ఆ మధ్యకాలంలో ఒక ఎన్నికలు జరిగాయి. ఎవరికి వోటెయ్యాలో తెలీక ప్లీడరు గుమాస్తా గారు పదిహేను రూపాయలిచ్చిన వాడికి వోటు వేశాడు.

అది స్వతంత్రం బేక్‌గ్రౌండ్.

స్వతంత్రం తండ్రిలా కాదు. వాణ్ని చాలామంది, వాడి ఈడున్నవాళ్లు, భారత స్వాతంత్ర్యం ప్రత్యక్షవతారంగా చూసేవాళ్లు. వాడు కూడా తాను ఒక రాజకీయ జాతక పురుషుణ్ని అనుకునేవాడు. వాడు ఒకేసారి విప్లవచర్యలో పాల్గొన్నాడు. 1942 ఆగస్ట్‌లో కాంగ్రెస్ నాయకులు జైల్లో పడ్డ మర్నాడు స్వతంత్రం ఈడున్నవాళ్లు ఓ ఇరవై మంది ఆవేశంగా ఊరిమీద పడి షాపులూ, హోటళ్లూ మూయించి, తిన్నగా రైలు స్టేషనుకు వెళ్లారు. రైల్వే పోలీసులు తాము దేశ ద్రోహులమనుకున్నట్టుగా విప్లవవీరులు కోరగానే టోపీలు తీసి కింద పెట్టారు. నలుగురితో పాటు స్వతంత్రం కూడా ఒక పోలీసు టోపీని ధైర్యంగా తొక్కాడు. తరువాత బుకింగాఫీసులోకి జొరబడి బాలవీరులు కరెన్సీ నోట్లు నేలమీద పోసి తగలబెట్టారు. ఆ హడావుడిలో స్వతంత్రం ఒక నోటు జేబులో పెట్టుకున్నాడు. ఇంకో నోటు తీస్తుండగా ఎవరో చూసి, వాడి చేతిమీద కొట్టి, నోటు లాక్కుని మంటల్లో వేశారు. స్వతంత్రం పైకి తప్పు చేసినవాడి మొహం పెట్టాడే గాని, లక్ష్మీదేవిని తగలెయ్యడంలో దేశభక్తి ఏమున్నదో వాడికి తెలీలేదు.

అటు తరవాత స్వతంత్రం జాతీయ, అంతర్జాతీయ రాజకీయ సంఘటనలలో ఆసక్తి కనబరచాడు గాని, రాజకీయ పార్టీలలోనూ వాటి ఆశయాలలోనూ ఆసక్తి యెంతమాత్రమూ కనబరచలేదు.

యుద్ధం యెప్పుడు ప్రారంభమైనదీ వాడికి గుర్తురాలేదు. వాడి జీవితాన్ని అది యేవిధంగానూ స్పృశించినట్టు కనబడలేదు. కాని రష్యా అన్నమాట జనాల నోళ్లలో నానసాగింది. రష్యా గురించి పెద్దలు చాలా నీచంగా చెప్పారు. పిన్నలు గొప్పగా చెప్పారు. పెద్దవాళ్ల మాటే వాడికి నిజం కావచ్చుననిపించింది.

"అవునండీ, జర్మనీ గెలవాల్సిందే. ఆ హిట్లరు గెలిస్తే ఆర్యధర్మం తిరిగి గడ్డమీద నాలుగు పాదాలా నడుస్తుంది" అని ఒక శాస్త్రుల్లుగారు తన తండ్రితో అనటం వాడు విన్నాడు. అదీ నిజమేననిపించింది. హిట్లరు ఆర్యుడట! అనార్యులను వేటాడుతున్నాడు. శ్రీ రామచంద్రులవారు వారిని వేటాడినట్లు! రాక్షసుల్ని వేటాడినట్లు.

"ఓ వేళ రాముడే హిట్లరుగా పుట్టలేదు గదా?" అని స్వతంత్రం తాను ఆశ్చర్యపడి కొద్దిమంది అంతరంగికులతో అన్నాడు కూడా. వాళ్లు విరగబడి నవ్వేసరికి స్వతంత్రం నిరుత్సాహపడి ఆ ఐడియాను శీఘ్రమే మరిచిపోయాడు. రాముడికి మీసాలుండేవా? లేక పేడిమూతివాడా? ఏమో?

హిట్లరు గెలవాలన్నవాళ్లకీ, వాడు చావాలన్నవాళ్లకీ ఏదో శత్రుత్వం ఉన్నట్లు స్వతంత్రం తెలుసుకుని, ఎవరితోనూ విరోధం పెట్టుకోవటం ఇష్టం లేక, తాను తటస్థంగా ఉండిపోయాడు.

చివరకు హిట్లరు ఆత్మహత్య చేసుకుని – రాముడు ఎలా చచ్చాడు? – యుద్ధంలో రష్యా గొప్పగా గెలిచి, అమెరికా బ్రిటన్‌లు కూడా రష్యాను పొగుడుతున్నట్లు విని, స్వతంత్రం తాను కూడా రష్యాను పొగుడుదామనుకున్నాడు.

కాని త్వరలోనే అమెరికా, బ్రిటన్‌లు రష్యాపట్ల ద్వేషమూ, ఓడిన జర్మనీ పట్ల స్నేహమూ చూపుతున్నట్లు తెలిసి స్వతంత్రం 'కూర్మం లాగా' ముడుచుకుపోయాడు.

వాడి రాజకీయ ఆదర్శం – 'గెలిచిన వాడి పక్షం ఉండు' – యుద్ధానంతరకాలం క్రమంగా రూపుదాల్చింది.

దేశవిభజన జరిగింది. మతకలహాల్లో ఎక్కడో నెత్తురు ఏర్లుకట్టి పారిందన్నారు. ఇవేవీ స్వతంత్రాన్ని స్పృశించలేదు.

స్వతంత్రమే వచ్చింది. 1947 ఆగస్ట్ 15న. కాని మన స్వతంత్రం ఉన్నచోటనే ఉండిపోయాడు. కమ్యూనిస్టులూ, సోషలిస్టులూ, హిందూ మహాసభ వాళ్లూ, ఇంకెవరెవరో వెనక్కుపోయి కాంగ్రెస్ పైకి తేలింది. ఘటనల రీత్యా కాంగ్రెస్ సత్యం, మిగిలిన పార్టీలు మిథ్యా!

మొదటిసారి యెలెక్షన్లు జరిగేనాటికి స్వతంత్రానికి ఓటున్నది. అది కాంగ్రెస్‌కు వేశాడు.

ఎవరో వాక్శుద్ధిగల కవి "ఒక్కసారి మంత్రి చెయ్యి, గణనాథా! నువ్వు ఓడకుంటే ఒట్టుపెట్టు గణనాథా!" అన్నట్టుగా కాంగ్రెస్ మంత్రులు కుర్రాళ్ల రాళ్లకి చింతకాయలు రాలినట్టు రాలారు.

'కమ్యూనిస్టులను బొత్తిగా తోసిపారెయ్యకూడదు లాగుందే' అనుకున్న స్వతంత్రం వాళ్లను గురించి మరీ సలీసుగా మాట్లాడడం తగ్గించాడు.

రెండో సాధారణ ఎన్నికలు జరిగి, తాను వోటు చేసిన కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్టు పోయిన అనంతరం, తాను రాజకీయ మహా నాయకుడు ఎప్పటికైనా అయితీరాలనీ, అప్పుడుగాని తన జన్మతారకూ నామ నక్షత్రానికీ సార్థక్యం ఉండదనీ స్వతంత్రానికి అనిపించింది.

కాని ఎలా? రాజకీయాలు కప్పల తక్కెడగా ఉంటున్నాయి. గెలిచినవాళ్లు ఓడుతున్నారు. ఓడినవాళ్లు గెలుస్తున్నారు. ఇలా ఎల్లకాలమూ ఉంటుందా? బ్రిటిష్‌వాళ్ల హయాంలో దశాబ్దాలపాటు పరిస్థితులు మారేవి కాదుట. వాళ్ల నాన్న ఎన్నోసార్లు అన్నాడు.

మళ్లీ అలాటి పరిస్థితి రావాలి! తాను గద్దె ఎక్కాలి!

"ఆ బ్రిటిష్ వెధవలు ఎందుకు వెళ్లిపోయారు? పోనీ, మళ్లీ రారాదూ? నాకేమన్నా ఛాన్సుంటుందేమో!" అనుకున్నాడు స్వతంత్రం. తన పేరుకు అర్థం కూడా పాటించకుండా. కాలక్రమాన దేశాన్ని పాలించేవారంతా వాడికన్న అర్థరహితంగా ఆలోచించసాగారు గనక మనం మన స్వతంత్రాన్ని తప్పుపట్టరాదు. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది.

రాను రాను స్వతంత్రానికి ఒకటి స్పష్టమయింది. కాంగ్రెస్‌కు తాను ఊహించినంత గొప్ప భవిష్యత్తు ఉండకపోవచ్చు. 'రాజాజీ లాంటి వాళ్లు బయటికి పోయారంటే అంతేగా?' కాని కమ్యూనిస్టులకు, భవిష్యత్తు అసలే లేదు. వాళ్లు అండర్ గ్రౌండ్ పోవటమూ, మళ్లీ బయటికి రావటమూ, కాస్సేపు విప్లవం అనటమూ, ఎన్నికలకు నిలబడటమూ, రెండుగా చీలటమూ, మళ్లీ మూడుగా చీలటమూ ఇదంతా అభ్యుదయ లక్షణం కాదు.

స్వతంత్రం మనస్సులో ఇంకా ఏ మూలనన్నా సందేహం ఉంటే, నక్సలైట్ల మూలంగా అది పూర్తిగా పోయింది. స్వతంత్రం తండ్రి పోయాడు. వాడి తమ్ముడు నక్సలైట్ అయినాడని స్వతంత్రం అనుమానం. పెళ్లి కావలసిన చెల్లెలు ఇరవైనాలుగేళ్లది ఉన్నది. కట్నాలు పొయ్యటం సంఘద్రోహమని స్వతంత్రం నమ్మకం. కట్నం లేకుండా ఆమెను పెళ్లిచేసుకుంటానని వొకడు – ఒకే వొకడు వచ్చాడు. వాడు తన తమ్ముడి స్నేహితుడు. తప్పక నక్సలైట్ అయి ఉంటాడు. స్వతంత్రం ఒప్పుకోలేదు.

ఒక శుభముహూర్తాన ఆ పిల్ల ఇంటి నుంచి లేచిపోయి, వర్ణాంతర వివాహం చేసుకున్నది. స్వతంత్రం హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

"నాకు సంఘసంస్కారం చాలా ఇష్టం. నా చెల్లెలు..." అని విన్న వారందరికీ చెప్పాడు. వాడు తన చెల్లెల్ని వెలివెయ్యలేదు. ఆమెను పెళ్లాడినవాడు డబ్బున్నవాడు. అడపాదడపా స్వతంత్రానికి వడ్డీకి అప్పులిచ్చేవాడు.

ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలంలో స్వతంత్రం దేశపరిస్థితులను గురించి ఆలోచించటం మాని తన గృహ పరిస్థితులను గురించి ఆలోచించే అవకాశం వచ్చింది. తన చెల్లెల్ని కట్నం లేకుండా పెళ్లాడుతానన్న వాణ్ని ఇందిరాగాంధీ జైల్లో పెట్టించింది. వాణ్ని నిరాకరించిన దన దూరదృష్టిని స్వతంత్రం ఎంతైనా మెచ్చుకున్నాడు.

అతను కాక ఇంకా ఎవరెవరో జైలుకు పోయారుట. ఆ వివరాలు తెలుసుకునే అవకాశం వాడికి లేదు. పిల్లలకు చదువు సాగటం లేదు. బళ్లలో ప్రవేశపెట్టడమే గగనంగా ఉన్నది. వర్ణాంతర బావమరిది ఒక్కొక్క ఎకరమే రాయించుకుని, మళ్లీ అప్పులిస్తున్నాడు. స్వతంత్రం తీసుకుంటున్నాడు. లేకపోతే జరగటం లేదే!

ఇప్పుడు స్వతంత్రం ఒక విషయం గమనించాడు. మంచో, చెడో ఒక రాజకీయ పార్టీకి అంటి పెట్టుకున్నవాళ్లు బాగుపడుతున్నారు. ఆ పార్టీవాళ్లు శాసనసభలోకో, లోక్‌సభలోకో ఎప్పటికైనా రాకపోరు. రేసులో ప్రతిసారీ రెండు నెంబరు మీద కాసినవాడు ఎప్పుడోప్పుడు డబ్బు కొడతాడు.

మరి స్వతంత్రం డబ్బు ఖర్చుచేసి ప్రతి రేసుకూ వెళ్లి, దానిమీద కాయని వాడుగా ఉండిపోతున్నాడు.

ఇందిరాగాంధీ శకం ముగియగానే ఏదో పార్టీలో చేరి తీరాలిసిందేనని స్వతంత్రం ఘట్టిగా అనుకున్నాడు. జనతాపార్టీ బాగుంది. అందులో అమాంబాపతు పార్టీలు చాలా ఉన్నాయి. ఎందులో చేరినా జనతాలో ఉన్నట్లే.

"జనతాపార్టీ గెలుపుచూసి మోసపోకు. ఇది ఇందిరాగాంధీ అపజయం! జనతా విజయం కాదు. జనతాపార్టీ అంటూ లేదు. అందులో చేరిన ఏ రాజకీయ పార్టీ కూడా రద్దుకాలేదు. వీళ్లు తమ గెలుపును పంచుకోవటంలో కొట్టుకుచస్తారు" అని రైలుస్టేషనులో ఎవరో ఇంకెవరితోనో అంటుంటే స్వతంత్రం విన్నాడు.

వాడు క్రియకు ఏ పార్టీలోనూ చేరలేదు. కాని మానసికంగా తాను జనతాపార్టీ వాణ్ని అనుకున్నాడు.

జనతాపార్టీలో ముసలం పుట్టింది. దాని పుట్టుకకు పురుడు పోసినవారిలో ముఖ్యమంత్రసానులను కుర్చీలో నుండి లేపారు. కాని అది స్వతంత్రాన్ని బాధించలేదు.

కాని జనతాపార్టీయే రెండుగా చీలినప్పుడు స్వతంత్రం నిర్ఘాంతపోయాడు. తాను మానసికంగా ఏ పార్టీలో ఉన్నట్టు? రెండు జనతాపార్టీలూ అధ్యక్షుడికి తమ పార్టీ బలాల జాబితాలు ఇచ్చాయి. రెండు జాబితాల్లోనూ తన పేరు ఉన్నట్లు స్వతంత్రం ఊహించుకున్నాడు.

అయితే తన పేరు మొరార్జీ జాబితాలో పొరపాటున స్పష్టమయింది! అది చరణ్‌సింగ్ జనతాలోనే ఉన్నది! భయంలేదు. తాను జనతా (ఎస్) పార్టీయే.

అయితే చరణ్‌సింగ్ స్వతంత్రానికి భయం కలిగించే పనిచేశాడు. ఇందిరతో పొత్తు కుదుర్చుకున్నాడు. జనతా కేంద్రంలో గద్దె ఎక్కినప్పటినుంచీ తాను మానసికంగా ఇందిరను నానా మాటలూ అన్నట్టు స్వతంత్రానికి గుర్తువచ్చింది.

అయినా ఫర్వాలేదు. ఇందిర చేత జైల్లో తోయించుకున్న వాళ్లే ఆవిణ్ని చంకనెక్కించుకుంటే మధ్య తనకు మొహమాటం దేనికి?

అయితే చరణ్‌సింగ్ చంకనెక్కినట్టు కనబడిన ఇందిర అతన్ని డొక్కలో తన్ని చంక దిగింది. రెండో జనతా వాళ్లు పూలమాలలతో ఇందిర వద్దకు వెళుతున్నారు.

అన్ని పార్టీలూ అబద్ధమే – కాంగ్రెసు కూడా! ఇందిర ఒక్కతే సత్యం!

స్వతంత్రం మానసికంగా ఇందిరతో చేరిపోయాడు.

ఇంతలో పాత ఎన్నికలు రద్దయి తిరిగి ఎన్నికలు జరుగుతాయంటున్నారు! మళ్లీ అంతా అనుమానంలో పడింది.

ఎవరు గెలుస్తారు? ఎవరు గద్దెలెక్కుతారు. స్వతంత్రం మానసికంగా యెవరితో చేరాలి?

ఎవరికైనా తెలిస్తే వాడికో కార్డుముక్క రాసి, పుణ్యం కట్టుకోండి. వాడి పొలమంతా వర్ణాంతరుడు లాక్కున్నాడు. వాడి సొంత చెల్లెలే వర్ణాంతరుడి పక్షమయింది. వాడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. రాజకీయాలతో డబ్బు గడించటం అన్నిటికన్నా సర్వోత్తమమైన మార్గం. రాజకీయ పరిశ్రమ ముందు ఏ పరిశ్రమా నిలవలేదు.

స్వతంత్రాన్ని ఆర్థికంగా గట్టెక్కించండి.

*ముద్రణ : ఆంధ్రజ్యోతి వారపత్రిక, దీపావళి ప్రత్యేక సంచిక, 1979*